బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 25 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్

- సెర్వికల్ క్యాన్సర్ నివారణకు కేంద్రం కీలక నిర్ణయం





**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బాలికల ఆరోగ్య రక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సెర్వికల్ క్యాన్సర్) నివారణకు ఉపయోగపడే హెచ్‌పీవీ (హ్యూమన్ ప్యాపిలోమా వైరస్) వ్యాక్సిన్‌ను 14 ఏళ్లు దాటిన బాలికలకు ఉచితంగా

అందజేయనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఈ టీకా కార్యక్రమం ప్రారంభం కానుంది. మిగితా 2వ పేజీలో

# భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ ఛేదింపు

- 16 రాష్ట్రాల్లో 104 మంది నిందితుల అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు
- అరెస్టయిన వారిలో మ్యూల్ అకౌంట్ హోల్డర్లు, అకౌంట్ సరఫరాదారులు, బ్యాంక్ అధికారులు
- దేశవ్యాప్తంగా 1,055 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధం
- రూ. 127 కోట్లు దోచేసిన గ్యాంగ్





**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నగరంలో సైబర్ నేరాలపై కట్టడి చర్యల భాగంగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పలు ప్రాంతాల్లో సమన్వయంతో దాడులు నిర్వహించారు. నగర సీపీ వీసీ సజ్జనార్ సీసీఎస్ పోలీసులకు ప్రత్యేక ఆదేశాలిచ్చారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' అనే ఈ ఆపరేషన్‌ను సరికొత్తగా రూపొందించారు. నగర సీపీ ఆదేశాలతో డీసీపీ (సైబర్ క్రైమ్స్) వీ. అరవింద్ బాబు నేతత్వంలో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు సైబర్ నేరస్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన పోలీసులు 104 మందిని అరెస్టు చేశారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన ఈ ప్రత్యేక చర్య ద్వారా దేశవ్యాప్త సైబర్ ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. బాధితుల సొమ్మును మళ్లించడానికి ఉపయోగించిన 151 బ్యాంక్ ఖాతాలను గుర్తించింది. అరెస్టయిన నిందితులకు దేశవ్యాప్తంగా 1,055 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధం ఉందని పోలీసుల విచారణలో తేలింది. ఈ మోసాల్లో మొత్తం రూ. 127 కోట్ల మేర బాధితులు నష్టపోయినట్టు గుర్తించారు.

'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో దేశవ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్‌ను సీసీఎస్ పోలీసులు అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. అనుభవం ఉన్న ఇన్వెస్టిగేటర్లతో 32 ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశారు. సైబర్ నేరస్తులు అడ్డాగా మార్చుకున్న 16 రాష్ట్రాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్ ఒడిశా రాష్ట్రాల్లో హాట్‌స్పాట్స్‌లల్లో 10 రోజుల పాటు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. నేరాల్లో కీలక పాత్ర పోషించిన 104 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో మ్యూల్ అకౌంట్ హోల్డర్లు 86మంది (అక్రమ సొమ్మును దాచడానికి తమ బ్యాంక్ ఖాతాలను ఉద్దేశపూర్వకంగా అప్పగించిన వారు.) ఉన్నారు. వారితోపాటు అకౌంట్ సప్లయర్లు/అగ్రిగేటర్లు 17మందిని ( ఖాతాలను సేకరించి, ప్రధాన సూత్రధారులకు డబ్బులు చేరవేసే మధ్యవర్తులు.), బ్యాంకింగ్ అధికారి ఒక్కరిని, (నేరగాళ్లతో కుమ్మక్కై నకిలీ ఖాతాలను తెరవడంలో సహకరించిన ఒక బ్యాంక్‌కు చెందిన రిలేషన్‌షిప్ మేనేజర్) అరెస్ట్ చేశారు. వీరి నుంచి 204 సెల్‌ఫోన్లు, 141 సిమ్‌కార్డులు, 152 బ్యాంక్ పాస్‌బుక్కులు, 234 డెబిట్, క్రెడిట్ కారులు, 26 ల్యాప్‌టాప్‌లు, 56 కార్పొరేట్, ప్రభుత్వ సంస్థల స్టాంపులు, రూ.36లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ మొత్తం జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్) ఎస్.ఎం. విజయ్ కుమార్, డీసీపీ (సైబర్ క్రైమ్స్) వీ. అరవింద్ బాబు పర్యవేక్షణలో జరిగింది. సీసీఎస్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బంది పాల్గొన్నారు. వీరిని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించినారు. ఉన్నత స్థాయి వ్యక్తులను పట్టుకునే వరకు దర్యాప్తు కొనసాగుతుందని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ స్పష్టం చేశారు. సైబర్ నేరాల పట్ల హైదరాబాద్ సిటీ పోలీస్ "జీరో టాలరెన్స్" (సహించేది లేదు) విధానాన్ని అనుసరిస్తోందన్నారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' నిరంతర ప్రక్రియ అని, ఈ ముఠాల్లోని ఉన్నత స్థాయి వ్యక్తులను పట్టుకునే వరకు దర్యాప్తు కొనసాగుతుందని హెచ్చరించారు. ఎవరైనా సరే, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

## అమెరికా ఒత్తిడితోనే వాణిజ్య ఒప్పందం

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, డేటా, వస్త్ర రంగాల అంశాల్లో ఒత్తిడికి లోనై దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. భోపాల్‌లో నిర్వహించిన కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదం లేకుండానే త్వరితగతిన పూర్తిచేశారని ఆరోపించారు. వ్యవసాయ రంగంపై అమెరికాతో జరిగిన చర్చలు నాలుగు నెలలుగా నిలిచిపోయాయని, అమెరికా సోయా, పత్తి, మక్కజొన్న, పప్పుధాన్యాలకు భారత మార్కెట్‌ను తెరవాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం మొదట వ్యతిరేకించిందని రాహుల్ గాంధీ తెలిపారు. "భారత రైతులు ఎవరూ దీనికి అనుకూలంగా లేరు. ప్రభుత్వం కూడా మొదట అంగీకరించలేదు. అయితే అకస్మాత్తుగా ప్రధాన మంత్రి నిర్ణయం మార్చుకున్నారు" అని అన్నారు. ఈ ఒప్పందంపై కేబినెట్‌లో చర్చ జరగలేదని, సంబంధిత మంత్రులతో సంప్రదింపులు జరపకుండా నేరుగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆయన ఆరోపించారు.

ఈ ఒప్పందం రైతులకు, వస్త్ర పరిశ్రమకు నష్టం చేస్తుందని, దేశ డేటా భద్రతను కూడా ప్రభావితం చేస్తుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. "21వ శతాబ్దం డేటా శతాబ్దం. ఈ ఒప్పందంలో చిన్న అక్షరాల్లో భారత డేటాను అమెరికాకు అప్పగించారు" అని విమర్శించారు. అమెరికాలో నమోదైన కేసులు, ఎప్‌స్టీన్ ఫైళ్ల అంశం వంటి విషయాలు ఒత్తిడిగా మారాయని కూడా రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి సంబంధించిన అమెరికా కేసు కూడా ఈ నిర్ణయానికి కారణమై ఉండవచ్చని అన్నారు. అమెరికా సుప్రీంకోర్టు గ్లోబల్ టారిఫ్‌లను రద్దు చేసిన తరువాత ఇతర దేశాలు తమ ఒప్పందాలను పునఃసమీక్షించాయని, కానీ భారత్ మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. "ధైర్యం ఉంటే ఈ ఒప్పందాన్ని రద్దు చేయండి" అని ప్రధానమంత్రికి సవాల్ విసిరారు.

## నలుగురు మావోయిస్టు అగ్రనేతలు లొంగుబాటు



- డీజీపీ బి.శివధర్‌రెడ్డి సమక్షంలో..
- రూ.90 లక్షల రివార్డు మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ డీజీపీ బి.శివధర్‌రెడ్డి సమక్షంలో మావోయిస్టు అగ్రనేతలు నలుగురు మంగళవారం లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి, సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లా రాజి రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కా రావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహా రెడ్డి ఉన్నారు. వీరంతా దశాబ్దాలుగా అండర్‌గ్రౌండ్‌లో కొనసాగుతున్న అగ్రనేతలని పోలీసులు తెలిపారు. తిప్పిరి తిరుపతి 44 సంవత్సరాలు, మల్లా రాజి రెడ్డి 46 సంవత్సరాలు, బడే చొక్కా రావు 28 సంవత్సరాలు, నూనె నర్సింహా రెడ్డి 36 సంవత్సరాలు భూగర్భ జీవితం గడిపినట్లు పోలీసులు వెల్లడించారు.వీరిపై ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతులు కూడా ఉన్నాయి. తిరుపతిపై రూ.25 లక్షలు, రాజి రెడ్డిపై రూ.25 లక్షలు, చొక్కా రావుపై రూ.20 లక్షలు, నర్సింహా రెడ్డిపై రూ.20 లక్షల రివార్డు ఉంది. మొత్తం రూ.90 లక్షల అర్హత గల రివార్డు మొత్తాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉపశమన--పునరావాస విధానాల ప్రకారం డిమాండ్ డ్రాఫ్టులు/చెక్కుల రూపంలో అందజేసినట్లు అధికారులు తెలిపారు.

లొంగుబాటు కార్యక్రమం హైదరాబాద్‌లోని ఐసీసీసీ వద్ద నిర్వహించగా, డీజీపీ మీడియాతో మాట్లాడారు. సీపీఐ(మావోయిస్టు)కు చెందిన నలుగురు అగ్రనేతల లొంగుబాటుతో ఆ పార్టీ సాయుధ పోరాటం ఇక ముగిసినట్టేనని రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ ఎలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహరెడ్డి ఎలియాస్ గంగన్నలు తమ ఎదుట లొంగిపోయినట్టు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్(ఐసీసీ)లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర డీజీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకేసారి నలుగురు అగ్రనా యకులు లొంగిపోవడం, అందులో పార్టీ ప్రధాన కార్యదర్శిగా చెప్పబడుతున్న దేవ్‌జీ ఉండటం రాష్ట్ర పోలీసులు జరిపిన కృషికి నైతిక విజయమని గర్వంగా తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని చేసిన విజ్ఞప్తి మేరకే వీరు లొంగుబాటులో నడిచారని ఆయన చెప్పారు. దాదాపు 40 ఏండ్లకు పైగా మావోయిస్టు ఉద్యమంలో అజ్ఞాతంలో గడిపిన వీరి కోసం కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలు కొన్నేండ్లుగా గాలింపు చర్యలు సాగించాయనీ, చివరికి ఈ లొంగు బాటుతో మావోయిస్టు ఉద్యమానికి దాదా పుగా తెరపడినట్టేనని డీజీపీ తెలిపారు. వీరిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిలపై రూ.25 లక్షల చొప్పున రివార్డు ఉండగా, మిగతా ఇద్దరిపై రూ.20 లక్షల చొప్పున పారితోషకం ఉందని చెప్పారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రివార్డును కలిపితే వీరిలో ఒక్కొక్కరికి రూ.90 లక్షల చెక్కులను ఈ కార్యక్రమంలో అందజేస్తున్నామని డీజీపీ స్పష్టం చేశారు. అనారోగ్యం, సాయుధ బలగాల వ్యూహాత్మక ఒత్తిడి, నాయకుల మధ్య అంతర్గత విభేదాలు, జరుగుతున్న ఎన్ కౌంటర్‌లు... వెరసి ఈ నాయకుల లొంగు బాటుకు మిగితా 4వ పేజీలో



## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య

**బలగం టీవి, హైదరాబాద్**

అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. భర్త, భార్యతో పాటు కుమారుడు సూసైడ్ చేసుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్ అంబర్‌పేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కె మూర్తి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

అంబర్‌పేట బాపునగర్ కాకతీయ బజార్‌లో కడిగేకర్ రామరాజు(54), అతని భార్య కే.మాధవి(50), కుమారుడు శశాంక్ రాజ్ (27) నివాసముంటున్నారు. దంపతులకు అమూల్య అనే కుమార్తె ఉంది. ఆమెకు ఏడేండ్ల క్రితం జీడిమెట్ల ప్రాజెక్టు కాలనీకి చెందిన జి.కిరణ్ కుమార్‌తో వివాహం జరిగింది. రామరాజ్ మల్లాపూర్‌లో తన కుమారుడు శశాంక్ రాజ్‌తో కలిసి కింగ్స్ బిర్యాని రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. అయితే రామరాజుకు గత కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఐదారు రోజులుగా ఇంకా డిప్రెషన్‌లోకి వెళ్ళాడు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామున అతన తన భార్య, కుమారుడితో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడు. 10 రూపాయల బాండ్ పేపర్ పై సూసైడ్ నోట్ రాశారు మిగితా 2వ పేజీలో

## కేరళ "కేరళం"గా మార్పు

- కేంద్రక్యాబినెట్ ఆమోదం
- అహ్మదాబాద్‌లో మెట్రో రెండో దశకు గ్రీన్ సిగ్నల్
- పవర్‌గ్రిడ్‌కు ఈక్విటీ పెట్టుబడి పరిమితి పెంపు
- రూ.12,236 కోట్లతో రైల్, మెట్రో, ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టులకూ గ్రీన్‌సిగ్నల్




**బలగం టీవి, న్యూఢిల్లీ**

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదం తెలిపింది. నూతన పీఎంఒ కాంప్లెక్స్ 'సేవా తీర్థ్'లో ప్రధాన మంత్రి చీుతీవఅంతీు వీశీఉఱ అధ్యక్షతన జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

కేంద్ర కేబినెట్ ఆమోదం అనంతరం 'కేరళ పేరు మార్పు బిల్లు--2026'ను రాష్ట్రపతి కేరళ శాసనసభకు పంపనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం సంబంధిత రాష్ట్ర అభిప్రాయాన్ని కోరడం తప్పనిసరి. శాసనసభ అభిప్రాయం అందిన తరువాత రాష్ట్రపతి సిఫారసుతో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టబడుతుంది. లోక్‌సభ, రాజ్యసభల ఆమోదం పొందిన తరువాత రాష్ట్రపతి సమ్మతితోనే మార్పు అమల్లోకి వస్తుంది.

2024 జూన్ 24న కేరళ శాసనసభ రాష్ట్ర పేరును 'కేరళం'గా మార్చాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మలయాళ భాషలో రాష్ట్రం పేరు 'కేరళం' అని, 1956 నవంబర్ 1న భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగినప్పటికీ రాజ్యాంగ తొలి షెడ్యూల్‌లో మాత్రం 'కేరళ'గా నమోదైందని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. 'ఐక్య కేరళం' డిమాండ్ స్వాతంత్ర్య పోరాట కాలం నుంచే ఉన్నదని గుర్తుచేశారు. మిగితా 2వ పేజీలో

## రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీ పై ఉన్న ధ్యాస హెల్త్ సిటీ పై లేదు..



- దేవాదుల ప్రాజెక్టును కాంగ్రెస్ సర్కార్ ఆగమాగం చేస్తోంది.
- కేసీఆర్ గారికి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే.. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను కావాలనే నత్తనడకన సాగిస్తున్నారు.
- వెంటనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రారంభించకపోతే.. వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్ష
- దమ్మింటే అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా, కెమెరాలు తిప్పకుండా సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు రావాలి.
- మాజీ మంత్రి హరీష్ రావు

**బలగం టీవి, వరంగల్**

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీపై ఉన్న ధ్యాస... పేదలకు ప్రాణం పోసే హెల్త్ సిటీపై లేదు" అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పార్టీ నేతలతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

**దేవాదులపై డెడ్‌లైన్ల రాజకీయం**

దేవాదుల ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం డెడ్‌లైన్లు మారుస్తూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 7300 కోట్లతో 3.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మంత్రులు మారే డెడ్‌లైన్లు ప్రకటిస్తున్నారే తప్ప పనులు ముందుకు సాగడం లేదన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి వేర్వేరు గడువులు ప్రకటించడాన్ని ఆయన ప్రస్తావించారు. "రోజుకో తేదీ మారుతోంది గానీ మిగితా 4వ పేజీలో

## అమెరికాను ముంచెత్తిన మంచు తుఫాను

- 10 వేలకుపైగా విమానాలు రద్దు...
- లక్షలాది ఇళ్లకు విద్యుత్ అంతరాయం



**బలగం టీవి, న్యూయార్క్**

అమెరికా ఈశాన్య ప్రాంతాన్ని సోమవారం భారీ మంచు తుఫాను వణికించింది. న్యూయార్క్ సహా పలు ప్రధాన నగరాల్లో వీధులు దట్టమైన మంచుతో కప్పుకుపోయి ప్రమాదకరంగా మారాయి. లక్షలాది మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజా రవాణా వ్యవస్థ స్థంభించగా, దేశీయ విమానాలతో కలిపి దాదాపు 10 వేలకుపైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. John F. Kennedy International Airport, LaGuardia Airport, Boston Logan International Airport, Newark Liberty International Airport వంటి ప్రధాన విమానాశ్రయాల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. రద్దీగా ఉండే టెర్మినల్స్ నిర్మానుష్యంగా మారాయి. శనివారం నుంచి మంగళవారం మధ్య 10 వేలకుపైగా విమానాలు రద్దయ్యాయి. సోమవారం మాత్రమే 5 వేలకుపైగా, మంగళవారం 1,300కుపైగా సర్వీసులు నిలిపివేశారు.

రైళ్లు, బస్సు సేవలు పలు రాష్ట్రాల్లో నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. న్యూయార్క్ నగరంలో సోమవారం మధ్యాహ్నం వరకూ ప్రయాణాలపై నిషేధం విధించగా, న్యూయార్క్ స్టేట్, న్యూజెర్సీ, రోడ్ ఐలాండ్ రాష్ట్రాల పలు ప్రాంతాల్లో కూడా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి.

న్యూయార్క్ నగరంలోని Central Parkలో సోమవారం ఉదయం 15 అంగుళాలకు పైగా మంచు నమోదైంది. లాంగ్ ఐలాండ్, న్యూజెర్సీ, బోస్టన్, ఫిలడెల్ఫియా ప్రాంతాల్లోనూ భారీ హిమపాతం కురిసింది. గంటకు 35 మైళ్ల వేగంతో చలిగాలులు వీచగా, డెలావేర్, మసాచుసెట్స్ రాష్ట్రాల్లో 40--60 మైళ్ల వేగంతో గాలులు వీచినట్లు అధికారులు తెలిపారు. మంచు తుఫాను కారణంగా సుమారు 5.7 లక్షల ఇళ్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముఖ్యంగా మసాచుసెట్స్, న్యూజెర్సీ రాష్ట్రాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచును తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. భారీ హిమపాతం, చలిగాలులతో ఈశాన్య అమెరికా ప్రాంతంలో జనజీవనం పూర్తిగా స్థంభించింది. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి
- హాజరు కానున్న 9,97,075 మంది విద్యార్థులు
- 1,495 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 18వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించిన ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. ప్రతిరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు పరీక్ష ప్రారంభమయ్యాక ఐదు నిమిషాలు ఆలస్యం గా వచ్చినా అనుమతి ఉంటుంది. ఆ తర్వాత వస్తే అనుమతి ఉండదు. అయితే పరీక్ష ప్రారంభానికి మిగితా 4వ పేజీలో

### మున్సిపల్ ఎన్నికల్లో

## కాంగ్రెస్ బీజేపీ అరాచకాలు



- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆదిలాబాద్ జైల్లో బాల్క సుమన్‌ను పరామర్శ

**బలగం టీవి, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పరామర్శించిన అనంతరం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలతో కలిసి జైలుకు వెళ్లిన ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అరాచకాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు 10 స్థానాలు, సిపిఐకి 4 స్థానాలు లభించినప్పటికీ అధికారాన్ని దక్కనివ్వకుండా కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడిందని కేటీఆర్ అన్నారు. కేవలం 7 స్థానాలు గెలిచినా అధికారం చేజిక్కించుకునేందుకు అధికార దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

మహిళా కౌన్సిలర్లపై అసభ్య ప్రవర్తన, దాడులు జరిగినా సంబంధిత మంత్రి, ఎంపీ స్పందించలేదని విమర్శించారు. ఇదే తరహా ఘటనలు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోనూ చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. క్యాతన్‌పల్లిలో అక్రమాలను ప్రశ్నించినందుకే మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు పలువురు నేతలపై కేసులు పెట్టి అదిలాబాద్ జైలుకు తరలించారని కేటీఆర్ ఆరోపించారు. "అరాచకాలను అడ్డుకున్నందుకే కేసులు పెట్టారు" అని అన్నారు. ఇక కాంగ్రెస్, బీజేపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేసినా కేసులు నమోదు చేయలేదని, రాష్ట్ర డీజీపీ వ్యవహారం పక్షపాతంగా ఉందని విమర్శించారు.

బాల్క సుమన్ ఉద్యమ కాలంలో అనేకసార్లు జైలుకెళ్లారని, ఈ కేసులతో భయపడరని కేటీఆర్ స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదని, రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. క్యాతన్‌పల్లి, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్‌లలో ఎన్నికలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్‌ను కోరారు. గెలిచిన వారిని ప్రమాణ స్వీకారం చేయనివ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కూడా అక్రమంగా కేసు పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే ఆమె చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల అంశాలను వెలుగులోకి తెచ్చిన మీడియా ప్రతినిధులకు, సోషల్ మీడియా కార్యకర్తలకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. భారీగా తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రేవంత్ రెడ్డి దుష్పరిపాలనపై సబ్బండ వర్గాల ఆగ్రహం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని వర్గాల ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కనీస నాణ్యమైన భోజనం కోసం కూడా పాఠశాల విద్యార్థులు పోరాటాలు చేయాల్సి రావడం పాలనలో వైఫల్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు.జనగామ జిల్లా గూడూరు గ్రామంలోని గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులు పరిశుభ్రమైన ఆహారం అందించాలని డిమాండ్ చేస్తూ పాలకుర్తి--స్టేషన్ ఘన్‌పూర్ ప్రధాన రహదారిపై బైఠాయించిన ఘటన ప్రభుత్వ అసమర్థతను చాటిచెబుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

గడిచిన రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 112 ఫుడ్ పాయిజన్ ఘటనలు నమోదయ్యాయని, వీటి కారణంగా 2,422 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని కేటీఆర్ వెల్లడించారు. ముఖ్యంగా 123 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని, ఇది ప్రభుత్వ హత్యలతో సమానమని తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా తెలంగాణకు పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడం దురదృష్టకరమని కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల సమస్యలను పక్కనపెట్టి ఇతర అంశాలపై దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థను గాలికి వదిలేసి పాలనను విస్మరించిన ముఖ్యమంత్రి తీరు వల్ల రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## మహిళా న్యాయవాదిపై దాడి ఆందోళనకరం

- ఘటనను సీరియస్‌గా తీసుకుని బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి
- బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



బలగం టీవీ, హైదరాబాద్

రుద్రూర్ లో మహిళా న్యాయవాదిపై జరిగిన దాడిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. మహిళా న్యాయవాదిపై దాడి జరగడం ప్రజాస్వామ్యంపై జరిగిన ప్రత్యక్ష దాడిగా భావించాల్సిన తీవ్రమైన ఘటన అని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తి అదుపు తప్పిందని, హిందువులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఓ బాలుడిపై జరుగుతున్న దాడిని అడ్డుకుని ప్రశ్నించినందుకే మహిళా న్యాయవాది కళ్యాణి గారిని ఎంఐఎం వర్గానికి చెందిన ముష్కరులు అసభ్య పదజాలంతో దూషిస్తూ, గుంపుగా దాడికి పాల్పడటం అత్యంత అమానుషమని పేర్కొన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఈ ఘటనను పోలీసులు అత్యంత సీరియస్‌గా విచారించి, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ, రుద్రూర్‌లో జరిగిన ఘటనలు కేవలం యాదృచ్ఛికం కాదని, పక్కా ప్రణాళిక ప్రకారం జరుగుతున్న దాడులేనని ఆరోపించారు. హిందువులపై దాడులు పెరుగుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వర్గం మెప్పు పొందడం కోసం చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం ఆందోళన కలిగించే విషయమని విమర్శించారు. న్యాయవాదులు న్యాయవ్యవస్థకు కీలక స్తంభాలని, వారికే రక్షణ లేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని ఆయన వ్యాఖ్యానించారు. రేవంత్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లుతెరిచి, మహిళా న్యాయవాదికి పూర్తి భద్రత, న్యాయం కల్పించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా న్యాయవాదుల రక్షణకు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. న్యాయవాదుల భద్రత విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదని, బాధిత మహిళా న్యాయవాదికి భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## ఖమ్మం కూల్చివేతలపై హరీష్‌రావు ఆగ్రహం

- "ఇది ప్రజాస్వామ్యమా? లేక పోలీస్ రాజ్యమా?" అని మండిపాటు

బలగం టీవీ, హైదరాబాద్

ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల వినోబా నగర్‌లో పేదలు అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లను భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. వేలాది మంది పోలీసులను నాలుగు జిల్లాల నుంచి మోహరించి యుద్ధ వాతావరణం సృష్టించి ఇళ్లను కూల్చాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. "ఇది ప్రజాస్వామ్యమా? లేక పోలీస్ రాజ్యమా? పేద ప్రజలు మీకేమైనా తీవ్రవాదుల్లా కనిపిస్తున్నారా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని మీడియాను సంఘటనా స్థలానికి రానీయకపోవడం ప్రభుత్వం చేస్తున్న అరాచకానికి నిదర్శనమని హరీష్‌రావు విమర్శించారు. "చీకటి పనులు చేసేవారే మీడియాను చూసి భయపడతారు" అని వ్యాఖ్యానించారు.

ా అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు ఉన్న ఇళ్లనే కూల్చివేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఓటు వేసినందుకు మాకు తగిన శాస్తి జరిగింది అంటూ బాధితులు రోదిస్తున్నారని, ఇది హృదయ విదారకమని అన్నారు.

**తక్షణం కూల్చివేతలు ఆపాలి**

ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చడం అమానుషమని హరీష్‌రావు పేర్కొన్నారు. వెంటనే కూల్చివేతలను ఆపాలని, పోలీసులు వెనక్కి వెళ్లాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇంచు భూమి కూడా కదిలించకూడదని హెచ్చరించారు.

బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పేదల గూడు చెదిరితే అధికార గద్దెలు కూడా కూలిపోతాయని ఆయన హెచ్చరించారు. ఖమ్మం బిడ్డల కన్నీళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని హరీష్‌రావు పేర్కొన్నారు.

# నైపుణ్యాభివృద్ధి అభివృద్ధి వ్యూహం

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- ఇండియా స్కిల్స్ దక్షిణ ప్రాంత పోటీల ముగింపు వేడుక




బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి ఒక శాఖ మాత్రమే కాకుండా అభివృద్ధి వ్యూహంగా మారిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఎగత కొన్ని సంవత్సరాలుగా ఐటీఐలు మరియు శిక్షణా మౌలిక వసతులను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలను పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యంతో అడ్వాన్స్డ్ స్కిల్ సెంటర్లుగా రూపాంతరం చేస్తున్నామని, ఆధునిక యంత్రాలు, డిజిటల్ పరికరాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళికలను అమలు చేస్తున్నామని వివరించారు.

కన్హా శాంతి వనంలో నిర్వహించిన IndiaSkills Competition 2025--26 దక్షిణ ప్రాంత పోటీల ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంప్లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ క్రాంతి వేస్లీ, ఐఎఎస్ కూడా పాల్గొన్నారు.దక్షిణ భారత స్థాయి పోటీలలో 63 నైపుణ్య విభాగాల్లో 350కి పైగా పోటీదారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా 123 మంది యువతులు పాల్గొనడం విశేషంగా నిలిచింది. కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, ప్లంబింగ్, హీటింగ్ వంటి సంప్రదాయంగా పురుషాధిక్య రంగాల్లో 20 మంది మహిళలు పోటీ చేయడం సామాజిక మార్పుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

3డి డిజిటల్, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోనమస్ మొబైల్ రోబోటిక్స్, బ్యూటీ థెరపీ, బ్రిక్ లేయింగ్, కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ తదితర విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను మంత్రి ప్రదానం చేశారు.

Telangana Academy for Skill and Knowledge విద్యాసంస్థలు--పరిశ్రమల మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి తెలిపారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కరణ సామర్థ్యం, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను శిక్షణలో భాగం చేశామని చెప్పారు.

హైదరాబాద్ ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో గ్లోబల్ కేంద్రంగా ఎదిగిందని, అందుకే ఎఐ, రోబోటిక్స్, మెచాట్రానిక్స్, డేటా అనలిటిక్స్, గ్రీన్ టెక్నాలజీస్ వంటి రంగాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి వెల్లడించారు. "నైపుణ్యాభివృద్ధి కేవలం ఉపాధి కోసం మాత్రమే కాదు, సాధికారత కోసం కూడా. నైపుణ్యం ఉన్న వారు అవకాశాల కోసం ఎదురుచూడరు, అవకాశాలను సృష్టిస్తారు" అని మంత్రి స్పష్టం చేశారు.

## కేరళ "కేరళం"గా మార్పు

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల పేర్ల మార్పు అధికారం పార్లమెంట్‌కే ఉంటుంది. రాష్ట్రపతి సిఫారసు లేకుండా బిల్లు ప్రవేశపెట్టలేరు. సంబంధిత రాష్ట్ర శాసనసభకు బిల్లును పంపి నిర్ణీత గడువులో అభిప్రాయాలు కోరాలి. ఇప్పటికే కేంద్ర హోం మంత్రి ఆమోదంతో డ్రాఫ్ట్ కేబినెట్ నోట్‌ను న్యాయ, శాసన విభాగాలకు పంపగా, వారు సమ్మతి తెలిపినట్లు సమాచారం.

**ఇతర కీలక నిర్ణయాలు**

కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకాలు అందించాలన్న నిర్ణయం తీసుకున్నారు. 14 ఏళ్ల బాలికలకు ఉచిత గర్దాసిల్ ఇంజెక్షన్ ఇవ్వాలని నిర్ణయించారు. అదేవిధంగా శ్రీనగర్‌లో రూ.1667 కోట్లతో విమానాశ్రయ నిర్మాణానికి, అహ్మదాబాద్ మెట్రో విస్తరణకు రూ.1667 కోట్ల మంజూరు చేశారు. విద్యుత్ రంగ సంస్కరణలకు కూడా ఆమోదం తెలిపారు.

## బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్

(మొదటి పేజీ తరువాయి)

**స్వచ్ఛందంగా టీకా**

ప్రభుత్వం ఉచితంగా అందజేసినా, వ్యాక్సిన్ తీసుకోవడం పూర్తిగా స్వచ్ఛందం. ఎలాంటి బలవంతం ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

**నాలుగు రకాల వైరస్‌ల నుంచి రక్షణ**

హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 వంటి రకాల నుంచి ఈ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుంది. ముఖ్యంగా హెచ్‌పీవీ 16, 18 రకాల వైరస్‌లు సెర్వికల్ క్యాన్సర్‌కు ప్రధాన కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా 2006 నుంచే ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ప్రస్తుతం 160 దేశాల్లో వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు 50 కోట్లకుపైగా డోసులు ఇవ్వబడినట్లు సమాచారం. ఈ టీకా 93 నుంచి 100 శాతం వరకు రక్షణ కల్పిస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**డోసుల వివరాలు**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న Gardasil 4 వ్యాక్సిన్‌ను
15 ఏళ్ల లోపు బాలికలు రెండు డోసులు
15 ఏళ్లు దాటిన వారు మూడు డోసులు
తీసుకోవాలి. అయితే కనీసం రెండు డోసులు తీసుకోవడం అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**నిపుణుల సూచనలు**

హెచ్‌పీవీ వైరస్ సాధారణంగా చర్మ సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది. చాలా సందర్భాల్లో శరీరం స్వయంగా వైరస్‌ను ఎదుర్కోగలుగుతుంది. అయితే హెచ్‌పీవీ 16, 18 వంటి రకాలు తీవ్రమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉన్నందున ముందస్తు రక్షణగా వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో ఈ నిర్ణయం కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతోనే తాము ఆత్మహత్య చేసుకున్నట్టు అందులో పేర్కొన్నారు.

రామరాజు తన ఇంట్లోని రెండో అంతస్థులో బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుమారుడు శశాంక్ రాజ్ ముందుగా చేతి మనికట్టును కత్తితో కోసుకుని తీవ్ర రక్తస్రావం జరిగిన తరువాత తాను చనిపోనేమోనని మరో గదిలో వెళ్లి ఉరివేసుకున్నట్టు తెలుస్తోంది. భార్య మాధవి మంచంపై మతిగా పడి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఆమె మరణానికి గల కారణాలపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ముందు తండ్రీ, కుమారుడు కలిసి ఆమెపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి తర్వాత వీరు ఆత్మహత్య చేసుకున్నారా? అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

శశాంక్ రాజ్ తన స్నేహితుడు రవికి తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్టు ఫోన్‌లో సందేశం పంపాడు. ఉదయం 8 గంటల సమయంలో ఆ మెసేజ్ చూసిన రవి వెంటనే ఇంటికి వెళ్లి చూడగా ముగ్గురు మతదేహాలు కనిపించాయి. వెంటనే దంపతుల కుమార్తె అమూల్యకు సమాచారం ఇచ్చాడు. ఆమె ఉదయం 10:30 ప్రాంతంలో అక్కడికి చేరుకుంది. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర ప్రభుత్వ విప్



**బలగం టీవీ, వేములవాడ:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విప్ ఆది శ్రీనివాస్‌ను అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై ఆశీర్వాదం అందించారని విప్ పేర్కొన్నారు. అదేవిధంగా, వేములవాడ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విప్ ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.



## కవలలను పెళ్లాడిన కవలలు

**బలగం టీవీ, కామారెడ్డి:**
పెళ్లిళ్లలో ఎన్నో వింతలు, విశేషాలు చూస్తుంటాం. కానీ కామారెడ్డి జిల్లాలో జరిగిన ఒక వివాహం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇద్దరు కవల సోదరులు, ఇద్దరు కవల సోదరీమణులను వివాహం చేసుకుని ఒకే ఇంటికి కోడళ్లుగా ఆహ్వానించారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన దుంపటి సాయిలు -- లక్ష్మి దంపతుల కుమారులు విజయ్, వినయ్ లు కవలలు. వీరికి వివాహం నిశ్చయించే క్రమంలో, అదే జిల్లాలోని దేమికలాన్ గ్రామానికి చెందిన కుమ్మరి గంగాధర్ -- గంగమణి దంపతుల కుమార్తెలు కీర్తన, కీర్తిలతో సంబంధం కుదిరింది. విశేషమేమిటంటే కీర్తన, కీర్తి కూడా కవలలే! తమ పిల్లలు కవలలు కావడంతో, అవతలి వారు కూడా కవలలు దొరకడం అదృష్టంగా భావించిన ఇరు కుటుంబాలు అంగరంగ వైభవంగా పెళ్లి వేడుకను నిర్వహించాయి. ఒకే ముహూర్తాన, ఒకే వేదికపై ఈ జంటలు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. రూపురేఖల్లో ఒకేలా ఉండే వధూవరులను చూసి అతిథులు సైతం ఆశ్చర్యపోయారు. ఎవరు విజయ్? ఎవరు వినయ్? అలాగే ఎవరు కీర్తన? ఎవరు కీర్తి? అని గుర్తుపట్టడం పెళ్లికి వచ్చిన బంధువులకు కాస్త కష్టమైనా, ఈ అరుదైన వేడుకను చూసి అందరూ మురిసిపోయారు. ప్రస్తుతం ఈ "కవలల కల్యాణం" సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొత్త జంటలను గ్రామస్తులు, బంధుమిత్రులు నిండు నూరేళ్లు వర్ధిల్లాలని దీవించారు.

## సిరిసిల్ల నుంచి అశ్వరావుపేటకు కొత్త బస్సు సర్వీస్

- ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి: డిపో మేనేజర్

**నవతెలంగాణ- రాజన్న సిరిసిల్ల**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) సిరిసిల్ల డిపో ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం నుంచి అశ్వరావుపేటకు కొత్త బస్సు సర్వీస్‌ను ప్రారంభించినట్లు డిపో మేనేజర్ ఎ.ప్రకాశ్ రావు తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 9:30 గంటలకు సిరిసిల్ల నుంచి బయలుదేరి వేములవాడ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, ఖమ్మం, సత్తుపల్లి మీదుగా సాయంత్రం 6:45 గంటలకు అశ్వరావుపేటకు చేరుకుంటుంది. సిరిసిల్ల పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు. ఈ సర్వీస్ ద్వారా మధ్యలోని పట్టణాల మధ్య ప్రయాణించే వారికి సౌకర్యం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## 'ఇది రియల్ ఎస్టేట్ సర్కార్.. ప్రజాపాలన కాదు'

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**నవతెలంగాణ- హైదరాబాద్**
రాష్ట్రంలో ప్రజాపాలన కాకుండా ప్రజా వంచన జరుగుతోందని, ఇది రియల్ ఎస్టేట్ సర్కార్‌గా మారిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ పరిసరాల్లో రూ.5 వేల కోట్ల వ్యయంతో గాంధీ విగ్రహం ఏర్పాటు పేరుతో 500 కుటుంబాలు, సుమారు 2,500 మంది నివసిస్తున్న ప్రాంతాన్ని చెరబట్టాలనుకోవడం దుర్మార్గమని ఆయన ఆరోపించారు. గాంధీ మహాత్ముడి మనవడు తుషార్ గాంధీ సైతం తన తాత పేరు మీద ఇలాంటి చర్యలు చేపట్టవద్దని, మహాత్మా గాంధీ బతికి ఉన్నా ఇలాంటి నిర్ణయాలను సమర్థించరని సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. విగ్రహం ఏర్పాటు పేరుతో ఇండ్ల కూల్చివేత భయంతో ఆ ప్రాంతానికి చెందిన 500 కుటుంబాలు గత కొన్నాళ్లుగా కంటి మీద కునుకు లేక ఆందోళనలో ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, రైతుభరోసా వంటి అంశాలపై చర్చించకుండా భూముల విషయంలో మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వంలో సీఎం, మంత్రులు భూములను కేకు ముక్కలుగా పంచుకుంటున్నారనే భావన కలుగుతోందని అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ సమీపంలోని వెలుగుమట్లలో భూదాన్ భూములపై పదేళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లపై చర్యలు చేపట్టడం అన్యాయమన్నారు. లాఠీలను అడ్డం పెట్టుకొని పేద, మధ్యతరగతి వర్గాలపై ఒత్తిడి తేవడం దుర్వినియోగమని విమర్శించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు జీవితకాలం కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందని ఆరోపించారు. గాంధీ విగ్రహం పేరుతో వేల కోట్ల రూపాయల దోపిడీకి రంగం సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గాంధీ విగ్రహం ఏర్పాటు పేరిట మధ్యతరగతి ప్రజల ఇళ్ల కూల్చివేతకు యత్నిస్తున్న ప్రభుత్వ తీరును ఖండిస్తున్నామని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో పరిశీలించిన అదనపు కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ఈ నెల 25 వ తేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. సిరిసిల్లలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సహస్ర జూనియర్ కళాశాల, సాయిశ్రీ జూనియర్ కళాశాల అలాగే తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లిలోని టీజీఎస్ డబ్ల్యూఆర్జేసీ కళాశాలలో చేసిన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4046, సెకండ్ ఇయర్ విద్యార్థులు 4060 పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల



(మార్చి 16వ తేదీ) దాకా నిర్వహించనున్నారని, ఉదయం 9 గంటలకు మొదలై మధ్యాహ్నం 12 గంటల వరకు చేపట్టనున్నారని తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులతో బృందాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ పరిశీలనలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శరత్ కుమార్, తంగళ్ళపల్లి మండలం తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకర గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి..



- డీఎంహెచ్‌వో డా. రజిత
- వైద్యాధికారులతో డీఎంహెచ్‌వో సమీక్ష

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో గుర్తించిన ప్రమాదకర గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. రజిత ఆదేశించారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో డీఎంహెచ్‌వో డా. రజిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డా. రజిత మాట్లాడుతూ ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీలను ముందుగానే గుర్తించి, సమయానుకూలంగా పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గర్భిణీపై వైద్యుల పర్యవేక్షణలో నియమిత చెకప్‌లు నిర్వహించి, అవసరమైన ఐరన్-ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేయాలని ఆదేశించారు. అలాగే సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, ఆరోగ్య కేంద్రాల ద్వారా అమలు అవుతున్న పథకాల నిర్దేశిత లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమ అధికారి డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ సంపత్, డాక్టర్ రామకృష్ణతో పాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఖబర్దార్ ఏపీ మంత్రి సుభాష్..

### కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలపై కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం

### ఏపీ మంత్రి సుభాష్ దిష్టిబొమ్మ దగ్ధం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**
ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలంగాణ జాతిపిత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుల కంచర రవి గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద మంత్రి సుభాష్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించి, పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహానేతపై విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు.

తెలంగాణను ద్రోహించిన పార్టీలకు ప్రజలు ఇప్పటికే తగిన తీర్పు ఇచ్చారని, రాష్ట్ర గౌరవాన్ని అవమానించే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. కేసీఆర్ గురించి మాట్లాడే ముందు తన రాజకీయ స్థాయి తెలుసుకోవాలని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి సుభాష్‌ను డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ



ఉద్యమకారుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేస్తూ, రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రతి ప్రయత్నానికి తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్ ఆరెల్లి వినయ్ కుమార్ రాకేష్ నాయక్ సాయికుమార్ రాకేష్ నాయక్ అభిరామ్ మహేష్ ఎండి అజ్జు నరేష్ రాము తదితరులు పాల్గొన్నారు

## బహుజనుల జోలికి వస్తే భవిష్యత్తు లేకుండా చేస్తాం. జిల్లా రజక సంఘం అధ్యక్షుడు




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**
నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో రజక కులానికి చెందిన రెండు నెలల పసిబిడ్డను హత్య చేసిన గుండాలకు కఠినంగా శిక్షించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా లో జిల్లా రజక సంఘం అధ్యక్షులు దుబ్బాక రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అంబేద్కర్ విగ్రహం నుండి ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి కొవ్వొత్తులతో చనిపోయిన పాపకు నివాళులు అర్పించడం జరిగింది పాప మరణానికి కారణమైన అగ్రవర్ణ గుండాలకు కఠిన శిక్షలు వేసే వరకు పోరాటం ఆగదు అని తెలిపారు. ఇట్టి కార్యక్రమములో రజక సంఘం నాయకులు మరియు బహుజనుల నాయకులు ఎస్సీ ఎస్టీ సంఘాల అధ్యక్షులు మహిళా అధ్యక్షులు యూత్ అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించడం జరిగింది

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

అరగంట ముందే కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఈ పరీక్షలు రాసేందుకు రాష్ట్రంలో 9,97,075 మంది దరఖాస్తు చేశారు. ఇందులో ఇంటర్ ప్రథమ సంవ త్సరం నుంచి 4,89,126మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 4,53,932 మంది ఉన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 1,495 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను సజావుగా, పకడ్బందీగా నిర్వహిం చేందుకు జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)తో పాటు జిల్లాస్థాయి హైపవర్ కమిటీ లను ప్రభుత్వం నియమించింది. ఫ్లయింగ్ స్క్వాడ్ లు, సిట్టింగ్ స్క్వాడ్స్‌లను ఇంటర్ బోర్డు నియమించింది. పరీక్షల సమయంలో విద్యా ర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కమిటీలు చర్యలు తీసుకుంటాయి. అవసర మైన రవాణా సదుపాయాలు, పరీక్షల సమ యంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ ఎయిడ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం తొమ్మిది నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా పోలీస్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారు. దాదాపు 7,500 సీసీ కెమెరాల ద్వారా పరీక్షల నిర్వహణను ఇంటర్ బోర్డు పర్యవేక్షించనుంది. పరీక్షల నిర్వహణ లో భాగంగా స్టేట్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. 040-2465 5027 లేదా 9402 05555 నెంబర్లను సంప్రదించవచ్చు. విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు నిరంతరా యంగా నిపుణులైన కౌన్సిలర్లు, ఉచిత మానసిక ఆరోగ్య సహాయం అందించను న్నారు. విద్యార్థులు టోల్‌ఫ్రీ నెంబర్ 14416 లేదా 80693 91416 నెంబర్లను సంప్రదించాలి.

రాష్ట్రంలో జరిగే ఇంటర్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి (సీఎస్) కె రామకృష్ణారావు ఆదేశించారు. విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం అయ్యాక ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణా రావు మాట్లాడుతూ బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు, వచ్చేనెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వ హించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయాని కన్నా ఐదు నిమి షాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యా ర్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నా మని వివరించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలనీ, గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత దృష్టి సారించాలని కోరారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యా లైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్‌ల సౌక ర్యాలు కల్పించడం తో పాటు సీసీటీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ఏఎన్ఎం, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదనీ, అన్ని కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను అనుమతిం చడం లేదని చెప్పారు. ఛీఫ్ సూపరింటెం డెంట్‌కు మాత్రమే ఎమర్జెన్సీ పరిస్థితుల్లో సెల్‌ఫోన్ ఉపయోగించడానికి అనుమతిస్తు న్నామని అన్నారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా గడియారాలను ఏర్పాటు చేస్తున్నా మని చెప్పారు. అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రతీ ప్రశ్నాపత్రానికి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందనీ, పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందు మాత్రమే వాటిని తెరవాలని స్పష్టం చేశారు. ఈసారి విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు.

# సెమీస్‌కు దూసుకెళ్లిన ఇంగ్లండ్

- **పాకిస్థాన్‌పై 2 వికెట్ల తేడాతో విజయం...**
- **హ్యారీ బ్రూక్ చారిత్రక శతకం**

**బలగం టీవీ, పల్లెకెలె**

సూపర్-8 దశలో ఇంగ్లండ్ జట్టు మరోసారి సత్తా చాటింది. పల్లెకెలె వేదికగా జరిగిన కీలక పోరులో పాకిస్థాన్‌ను 2 వికెట్ల తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకున్న తొలి జట్టుగా అవతరించింది. ఈ విజయంతో ఇంగ్లండ్ వరుసగా ఐదోసారి టీ20 ప్రపంచకప్ సెమీస్‌కు అర్హత సాధించింది.

**తడబడిన పాక్ బ్యాటింగ్... ఫర్హాన్ అర్ధశతకం**

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్‌కు ఆరంభంలోనే షాకులు తగిలాయి. సైమ్ అయూబ్ (7), సల్మాన్ అలీ ఆఘా (5) త్వరగా ఔటయ్యారు. ధీఘ్ఘితీ-ాఘ్ఘువ 25 పరుగులతో నిలకడగా కనిపించినా వేగంగా ఆడలేక వికెట్ కోల్పోయాడు. ఈ దశలో సాహిబ్జాదా ఫర్హాన్ (45 బంతుల్లో 63) జట్టును ఆదుకున్నాడు. చివర్లో షాదాబ్ ఖాన్ (23) మెరుపులతో పాకిస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 164 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో లియామ్ డాసన్ 3 వికెట్లు తీయగా, ఆర్చర్, ఓవర్టన్ చెరో రెండు వికెట్లు సాధించారు.




**బ్రూక్ చారిత్రక శతకం**

165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు షాహీన్ అఫ్రిది ప్రారంభంలోనే గట్టి దెబ్బ కొట్టాడు. 5 ఓవర్లకే 3 వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో పడింది. అయితే కెప్టెన్ బ్రూక్ అసాధారణ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. పాక్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 50 బంతుల్లో శతకం పూర్తి చేశాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇది మూడో అత్యంత వేగవంతమైన సెంచరీగా నిలిచింది. బ్రూక్ ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి.

బ్రూక్ ఔటయ్యాక మ్యాచ్ మళ్లీ ఉత్కంఠగా మారింది. షాహీన్ అఫ్రిది వరుస వికెట్లు తీయడంతో స్కోరు 161/8కు చేరింది. అయితే చివరి ఓవర్ తొలి బంతికే జోఫ్రా ఆర్చర్ బౌండరీ బాది ఇంగ్లండ్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ ఓటమితో పాకిస్థాన్ సెమీస్ అవకాశాలు దాదాపు గల్లంతయ్యాయి. సూపర్-8లో ఆడిన రెండు మ్యాచ్‌లలో ఆశించిన ఫలితాలు రాకపోవడం పాక్ అభిమానులను నిరాశకు గురిచేస్తోంది.

# నలుగురు మావోయిస్టు అగ్రనేతలు లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

దారి తీశాయని వివరించారు.

కేంద్ర కమిటీ సభ్యుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇంచార్జి కూడా అయిన దేవ్‌జీని ఇంకా ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నుకోలేదనీ, ప్రచారం మాత్రమే జరిగిందని శివధర్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో ఉన్న ముగ్గురిలో ముప్పాల లక్ష్మణ్‌రావు ఎలియాస్ గణపతి దండకారణ్యంలో లేరనీ,

ఆయన ఎక్కడున్నాడనే విషయంపై ఆరా తీస్తున్నామని చెప్పారు. మిగతా ఇద్దరిలో బెస్ర జార్ఖండ్‌లో, నరహరి ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నట్టు సమాచారముందని వివరించారు. వీరి లొంగుబాటు కోసం కూడా ప్రయత్నాలు తీవ్రతరం చేశామని ఆయన తెలిపారు. ఇక మిగిలినవారిలో గణపతి భార్య జోడె లక్ష్మీబాయితో సహా 11 మంది మావోయిస్టులు వివిధ శ్రేణిలలో పని చేస్తూ అజ్ఞాతంలో ఉన్నారనీ, వారిలో కేవలం సాంబయ్య అనే రాష్ట్ర కమిటీ సభ్యుడు మాత్రమే చురుకుగా ఉన్నాడనీ, వీరిని కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని డీజీపీ చెప్పారు. 'ఇది మావోయిస్టుల్లో కేవలం ఆకు రాలే కాలమా? లేక చెట్టు మొత్తం వాడిపోయినట్టా' అనే ప్రశ్నకు చెట్టు వాడిపోవడమే కాదు.. దాని నిర్మాణ క్రమం పూర్తిగా ధ్వంసమైందని డీజీపీ సమాధానమిచ్చారు. 'వీరు ఆయుధాలతో లొంగిపోయారా' అనే ప్రశ్నకు ఆ విషయం తర్వాత చెప్తామని జవాబిచ్చారు. మావోయిస్టు అగ్రనేతలు తెలంగాణలోనే లొంగిపోవడానికి కారణమేంటనే ప్రశ్నకు.. ఇక్కడి ప్రభుత్వం లొంగుబాటు కోసం ప్రకటించిన పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయడం, వారికి నూతన జీవనం గడపడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించడం, వారిపై ఉన్న కేసుల పట్ల కక్షపూరితంగాగాక సానుభూతితో వ్యవహరించడం వంటివి వారి లొంగుబాట్లకు కారణాలుగా ఆయన అభివర్ణించారు.

గణపతి మీ కాంటాక్ట్‌లోనే ఉన్నాడా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. అలా జరిగితే ఇంకా మంచిదే కదా అని డీజీపీ చెప్పారు. కేంద్ర హోం శాఖ పెట్టిన డెడ్‌లైన్‌కు అనుకూలంగా మీరు వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్నకు.. మాకు ఎలాంటి డెడ్‌లైన్‌లూ లేవు, మావోయిస్టులను లొంగుబాట్లకు ప్రోత్సహించడం చాలా ఏండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్నదే అని ఆయన సమాధానమిచ్చారు. నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు కలుపుకొని 2024, 2025తో పాటు ఈ ఏడాది ఇప్పటి వరకు 591 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఆయన వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దండకారణ్యం మొదలుకొని ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధితో పాటు దేశ ప్రజల సంక్షేమానికి చేపట్టిన పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో మావోయిస్టులు తిరిగి పుంజుకునే సమస్యే ఉత్పన్నం కాదని ఆయన మరో ప్రశ్నకు జవాబిచ్చారు. మావోయిస్టు ఉద్యమం తెలంగాణలోనే పుట్టింది, ఇక్కడే ముగుస్తున్నదని డీజీపీ వ్యాఖ్యానించారు.

లొంగిపోయిన వారిలో పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి, సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లా రాజి రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కా రావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహా రెడ్డి ఉన్నారు. వీరంతా దశాబ్దాలుగా అండర్‌గ్రౌండ్‌లో కొనసాగుతున్న అగ్రనేతలని పోలీసులు తెలిపారు. తిప్పిరి తిరుపతి 44 సంవత్సరాలు, మల్లా రాజి రెడ్డి 46 సంవత్సరాలు, బడే చొక్కా రావు 28 సంవత్సరాలు, నూనె నర్సింహా రెడ్డి 36 సంవత్సరాలు భూగర్భ జీవితం గడిపినట్లు పోలీసులు వెల్లడించారు.వీరిపై ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతులు కూడా ఉన్నాయి. తిరుపతిపై రూ.25 లక్షలు, రాజి రెడ్డిపై రూ.25 లక్షలు, చొక్కా రావుపై రూ.20 లక్షలు, నర్సింహా రెడ్డిపై రూ.20 లక్షల రివార్డు ఉంది. మొత్తం రూ.90 లక్షల అర్హత గల రివార్డు మొత్తాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉపశమన--పునరావాస విధానాల ప్రకారం డిమాండ్ డ్రాఫ్ట్‌లు/చెక్కుల రూపంలో అందజేసినట్లు అధికారులు తెలిపారు.

తిప్పిరి తిరుపతి జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందినవారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరి, తర్వాత దండకారణ్య ప్రాంతంలో సాయుధ దళంలో పనిచేశారు. మల్లా రాజి రెడ్డి పెద్దపల్లి జిల్లా మంథని మండలానికి చెందినవారు. దండకారణ్య ప్రాంతంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. బడే చొక్కా రావు ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందినవారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ మిలిటరీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. నూనె నర్సింహా రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందినవారు. పీఎల్‌జీఏ తొలి బెటాలియన్‌లో పనిచేశారు.

**సీఎం పిలుపుతో లొంగుబాటు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మావోయిస్టు కార్యకర్తలకు హింసను విరమించి ప్రధాన ప్రవాహంలోకి రావాలని చేసిన పిలుపు నేపథ్యంలో ఈ లొంగుబాట్లు జరిగాయని పోలీసులు పేర్కొన్నారు. సిద్ధాంత విభేదాలు, అంతర్గత విభజనలు, భూమి వాస్తవాలు--వాదాల మధ్య పెరిగిన అంతరం కూడా ఈ నిర్ణయానికి కారణమని వివరించారు. ఈ లొంగుబాటుతో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యకలాపాలు దాదాపు నిర్వీర్యమయ్యాయని పోలీసులు తెలిపారు.

# రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీ పై ఉన్న ధ్యాస హెల్త్ సిటీ పై లేదు..

(మొదటి పేజీ తరువాయి)

అంగుళం పని కదలడం లేదు" అని వ్యాఖ్యానించారు.

**అసెంబ్లీలో చర్చకు సవాల్**

ఇరిగేషన్ అంశంపై అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా, కెమెరాలు తిప్పకుండా చర్చకు రావాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. "ప్రజలే న్యాయనిర్ణేతలు. ఎవరు ఏం చేశారో సభ వేదికగా తేల్చుకుందాం" అని అన్నారు.

**వరంగల్ హెల్త్ సిటీపై ఆగ్రహం**

బీఆర్ఎస్ హయాంలోనే 24 అంతస్తుల నిర్మాణం పూర్తైన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కాంగ్రెస్ పాలనలో నిలిచిపోయిందని విమర్శించారు. 2000 పడకల ఆసుపత్రికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నియామకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. "ఓపీ సేవలతో ప్రారంభిస్తామని చెప్పడం సరైంది కాదు. ఇది సూపర్ స్పెషాలిటీ హాస్పిటలా? లేక బస్తీ దవాఖానానా?" అని ప్రశ్నించారు.

వెంటనే సిబ్బంది నియామకాలు, పరికరాల ఏర్పాటు పూర్తి చేసి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రారంభించాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ తరఫున నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు.

**ఎంజీఎం ఆసుపత్రి పరిస్థితి దయనీయమని విమర్శ**

ఎంజీఎం ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని, పరికరాలు పనిచేయడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఉచిత గుండె ఆపరేషన్లు నిర్వహించామని గుర్తుచేశారు. ప్రస్తుతం రోగులను హైదరాబాద్‌కు తరలించే పరిస్థితి ఏర్పడిందన్నారు.

**జర్నలిస్టుల సంక్షేమంపై ప్రశ్నలు**

బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టుల కోసం హెల్త్ స్కీమ్, సంక్షేమ నిధి ఏర్పాటు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేయకపోతే వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్ష చేపడతామని హరీష్ రావు స్పష్టం చేశారు. "ఫ్యూచర్ సిటీ కంటే పేదల ప్రాణాలు ముఖ్యం" అని అన్నారు. ఈ పర్యటనలో మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## జార్జియాకు మహేష్‌బాబు పయనం

**'వారణాసి' చిత్ర భారీ షెడ్యూల్‌కు శ్రీకారం**

**బలగం టీవీ, హైదరాబాద్**

అగ్ర హీరో మహేష్‌బాబు జార్జియా పయనమయ్యారు. గురువారం నుంచి 'వారణాసి' సినిమాకు సంబంధించిన భారీ షెడ్యూల్ అక్కడ ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో Priyanka Chopra, Prithviraj Sukumaran కూడా పాల్గొననున్నారు. సినిమా షూటింగ్ జూన్ నాటికి పూర్తికానుందని, సెప్టెంబర్ నుంచి నేపథ్య సంగీత పనులు ప్రారంభమవుతాయని సంగీత దర్శకుడు వీ. వీ. Keeravani ఇటీవల వెల్లడించారు.

దర్శకుడు రాజమౌళి తన గత చిత్రాలతో పోలిస్తే ఈ సినిమాను వేగంగా పూర్తి చేస్తున్నారని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. పురాణ, ఇతిహాసాల మేళవింపుగా సాగే పాన్ వరల్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఇందులో మహేష్‌బాబు కొన్ని నిమిషాల పాటు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. ఆ ఎపిసోడ్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని రాజమౌళి ఇటీవల నిర్వహించిన గ్లోబ్‌ట్రాటర్ వేడుకలో వెల్లడించారు. శ్రీరాముడు, మహాశివుడు, వారణాసి క్షేత్రం, సమకాలీన ప్రపంచం వంటి అంశాల సమ్మేళనంగా కథ సాగుతుందని తెలుస్తోంది.